సాక్షి నిర్మల్

సోమవారం, 16, అక్టోబర్, 2023



సేటు చెప్పిందే రేటు

మొక్కజొన్న పంటకు రోజురోజుకూ ధర తగ్గుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు. 11లో▸



బాసరలో నవరాత్రి ఉత్సవాలు

బాసరలో దేవి నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా ప్రారంభించారు. ఆదివారం వేకువజామున అర్చకులు కలశాలతో ఆలయానికి వెళ్లి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. 12లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 33.6 /23.3

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంకన్నా ఎక్కువగా నమోదవుతాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి చల్లగా ఉంటుంది.

న్యూస్‌రీల్

సబ్బండ వర్గాలకు అండగా మేనిఫెస్టో..

- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సాగుతున్న కేసీఆర్ పాలన స్వర్ణయుగమని, దేశంలో ఎక్కడా లేని పథకాలతో వరుసగా మూడోసారి సబ్బండ వర్గాలకు అండగా నిలిచే మేనిఫెస్టోను ప్రకటించారని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో ఆదివారం బీఫామ్ తీసుకున్న తర్వాత ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో అద్భుతంగా ఉందన్నారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న పలు పథకాల పరిధిని పెంచేలా, లబ్ధిదారులకు మరింత మేలు జరిగేలా ఉండటం హర్షనీయమన్నారు. తెలంగాణ సంపదను పెంచుతూ ప్రజలకు పంచుతున్నామన్నారు. పదేళ్ల పాలనలో చేపట్టిన పథకాలకు ఎన్నో ప్రశంసలు వచ్చాయన్నారు.

గజ్జలమ్మదేవికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవారి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి జక్కని గజేందర్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అలంకరణ, పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మహాలక్ష్మి అమ్మవారికి వెండి కిరీటం



అమ్మవారికి అలంకరించిన వెండి కిరీటం

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీకి చెందిన దాసరి మానస–నర్సయ్య దంపతులు ఆదివారం మహాలక్ష్మి అమ్మవారికి రూ.1.20 లక్షల విలువైన కిలో 200 గ్రాముల వెండికిరీటం అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అర్చకులు కిరీటాన్ని అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



మాట్లాడుతున్న శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: బీఆర్‌ఎస్, బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి నిర్మల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు నిర్మల్‌రూరల్ మండలం, నర్సాపూర్ (జి) మండలాలకు చెందిన వివిధ పార్టీల నాయకులు ఆదివారం హస్తం గూటికి చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతు డిక్లరేషన్, దళిత డిక్లరేషన్, నిరుద్యోగ డిక్లరేషన్, గృహజ్యోతి, మహాలక్ష్మి, చేయూత పథకాలను ప్రకటించిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సోనియాగాంధీ ప్రకటించిన ఆరు హామీల పథకాలను కచ్చితంగా అమలు చేస్తామన్నారు.

కొనసాగుతున్న జోనల్‌స్థాయి క్రీడలు



ఖోఖో పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

సోన్: మండలంలోని లెఫ్ట్ పోచంపాడ్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో మూడురోజులుగా 9వ జోనల్‌స్థాయి క్రీడాపోటీలు కొనసాగుతున్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నీరజ, ప్రిన్సిపాల్ సరస్వతి తెలిపారు. అండర్ 14, 17, 19 విభాగాల్లో పోటీలు నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

కూచాడికి కన్‌ఫాం..



- నిర్మల్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఖరారు
- ముధోల్, ఖానాపూర్ తర్వాత..
- ఉద్యమకారుడిగా, వకీల్‌సాబ్‌గా..
- ప్రజలకు దగ్గరైన శ్రీహరి
- ఇక మరింత ఉధృతంగా ప్రచారం

నిర్మల్: కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల తొలిజాబితా వెల్లడించింది. కానీ.. జిల్లాలో కేవలం నిర్మల్ నియోజకవర్గానికి చెందిన డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పేరు మాత్రమే ప్రకటించింది. ముధోల్, ఖానాపూర్ రెండింటినీ రెండో లిస్టుకు వాయిదా వేసింది. ఇక ముందుగా ఊహించినట్లే ఉద్యమకారుడిగా, వకీల్‌సాబ్‌గా ప్రజల్లో పేరొందిన కూచాడి శ్రీహరిరావుకే నిర్మల్ సీటు దక్కింది. ఇక్కడి నుంచి జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మరికొందరు అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ పార్టీ అధిష్టానం 'కూచాడి'కే జైకొట్టింది. ముధోల్, ఖానాపూర్ రెండుచోట్లా సరైన అభ్యర్థులు లేకపోవడం, ఉన్నచోటా పోటీ ఉన్న కారణంగా వాయిదా వేసినట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి.

కాంగ్రెస్ నుంచే రాజకీయం

కాంగ్రెస్ నుంచే తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన కూచాడి శ్రీహరిరావు ఇప్పుడు అదే పార్టీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అప్పటి టీఆర్‌ఎస్‌లో చేరిన ఆయన పశ్చిమజిల్లా అధ్యక్ష స్థాయికి చేరుకున్నారు. 2009, 2014లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిచి గట్టిపోటీ ఇచ్చారు. 2018లో అధిష్టానం ఆదేశాల మేరకు మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి మద్దతిచ్చారు. జూన్‌లో కాంగ్రెస్‌లో చేరి డీసీసీ అధ్యక్ష పదవిని పొందారు. తాజాగా తన రాజకీయ గురువు ఇంద్రకరణ్‌రెడ్డిపై మూడోసారి పోటీకి దిగారు. కాంగ్రెస్‌లో చేరినప్పటి నుంచే ప్రచారం చేసుకుంటున్న శ్రీహరిరావు తాజాగా అభ్యర్థిత్వం ఖరారు కావడంతో ఉధృతం చేస్తామంటున్నారు. ఆయనకు సీటు దక్కడంతో పార్టీశ్రేణులు సంబురాలు జరిపాయి.



కూచాడి శ్రీహరిరావు

ఎటూ తేలని ముధోల్..

కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన తొలి జాబితాలో నిర్మల్ మాత్రమే ఉండటానికి ఇక్కడ శ్రీహరిరావు మినహా బలమైన నేత లేకపోవడమే కారణం. ముధోల్‌లో నియోజకవర్గాన్ని ప్రభావితం చేసే స్థాయి ఉన్న నేతలు లేకపోవడం మైనస్‌గా మారింది. కొత్తగా పార్టీలో చేరిన డాక్టర్ కొర్మెవార్ కిరణ్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్లు ఆనంద్‌రావు పటేల్, విజయ్‌కుమార్‌రెడ్డి తమవంతు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే నారాయణరావుపటేల్ మళ్లీ కాంగ్రెస్‌లో చేరుతానన్నట్లు చెబుతున్నారు. మొత్తం మీద ముధోల్‌లో సరైన స్పష్టత లేకపోవడం, బలమైన ఆశావహులు లేకపోవడంతో అభ్యర్థి ప్రకటన వాయిదా పడింది.

రేఖ చేరుతుందనేనా..

సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఈనెల 18న కాంగ్రెస్‌లో చేరనున్నట్లు ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడ హస్తం పార్టీ తన అభ్యర్థిని ప్రకటించలేదని తెలుస్తోంది. సిట్టింగ్‌లు, మాజీ ఎమ్మెల్యేలకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలన్న పార్టీ నిర్ణయం మేరకు ఆమెకు అవకాశం ఇస్తారా? అన్న చర్చ నడుస్తోంది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆదివాసీ నేత వెడ్మ బొజ్జు పటేల్ పేరు ప్రముఖంగా వినిపించినప్పటికీ టికెట్ ఖరారు కాకపోవడం గమనార్హం. వీరిద్దరితో పాటు భరత్‌చౌహాన్, చారులత రాథోడ్, వినోద్‌నాయక్, తదితరులు ఇక్కడ నుంచి టికెట్ ఆశిస్తున్నారు.

బయోడేటా..

పూర్తిపేరు : కూచాడి శ్రీహరిరావు
తల్లిదండ్రులు : సత్యమ్మ, ప్రకాశ్‌రావు
స్వగ్రామం : మామడ మండలం దిమ్మదుర్తి
విద్యాభ్యాసం : ఎల్‌ఎల్‌బీ
రాజకీయ అనుభవం..
1995 : మామడ ఎంపీపీ, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు
2001 : మామడ జెడ్పీటీసీ సభ్యుడిగా గెలుపు,
ఉమ్మడి జిల్లా పరిషత్‌లో కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్
2002 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా నియామకం.
2005 : పీసీసీ మెంబర్
2007 : జనవరి 23న టీఆర్‌ఎస్‌లో చేరిక
2009 : టీఆర్‌ఎస్ నుంచి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ
2010–2013: టీఆర్‌ఎస్ పశ్చిమ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా..
2014 : రెండోసారి అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ
2018 : టీఆర్‌ఎస్ అధిష్టానం ఆదేశాల మేరకు ఎన్నికల్లో పోటీ చేయకుండా మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డికి మద్దతు
2023 : జూన్ 14న రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక, డీసీసీ అధ్యక్షుడిగా నియామకం.

ఫస్ట్ లిస్ట్‌లో ముగ్గురే!

సాక్షిప్రతినిధి,మంచిర్యాల: దాదాపు నెల రోజులుగా ఊరించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థుల ఫస్ట్ లిస్ట్ ఎట్టకేలకు విడుదలైంది. ఇందులో ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాలకు కేవలం మూడు నియోజకవర్గాల అభ్యర్థులను మాత్రమే ప్రకటించారు. మిగతా ఏడింటిపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. పెద్దగా పోటీదారులు లేని మంచిర్యాల, బెల్లంపల్లి, నిర్మల్ టికెట్లు ఫస్ట్‌లిస్ట్‌లోనే ప్రకటించారు. వరుసగా ప్రేమ్‌సాగర్‌రావు, గడ్డం వినోద్, కూచాడి శ్రీహరిరావుకు టికెట్లు ఇచ్చారు. మలి విడత జాబితాలో మిగతా ఏడు టికెట్లు ప్రకటిస్తారని తెలుస్తోంది. ఈఏడు సీట్లలోనే పోటాపోటీగా నాయకులు ఉన్నారు. ఆదిలాబాద్, ముధోల్, ఖానాపూర్, బోథ్, ఆసిఫాబాద్, సిర్పూర్, చెన్నూర్ టికెట్లు ప్రకటించాల్సి ఉంది. దీంతో రెండో జాబితాపై అందరిలో ఆసక్తి నెలకొంది. వీటిలో చెన్నూర్‌ను పొత్తులో భాగంగా సీపీఐకి ప్రకటించే అవకాశం ఉంది. మిగిలిన స్థానాల్లో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

బోథ్, ఖానాపూర్‌పై పీటముడి

బోథ్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే వారికే టికెట్ ఖాయమని అనుచరవర్గాలు నమ్ముతున్నాయి. అయితే ఇప్పటికే అక్కడ కొంతకాలంగా పనిచేస్తున్న నాయకులు సీట్లపై ఆశలు పెట్టుకున్నారు. వారిని ఎలా బుజ్జగిస్తారనేది సవాల్‌గా మారింది. లేకపోతే ఎమ్మెల్యేలకే టికెట్ ఇవ్వకుండా గెలుపునకు కృషి చేయాలని సూచిస్తే పార్టీలోనే ఉంటారా? లేక వేరే దారి చూసుకుంటారా? అనేది తేలాల్సి ఉంది. బోథ్, ఖానాపూర్, ఆసిఫాబాద్ ఎస్టీ స్థానాల్లో లంబాడా, ఆదివాసీలతో భర్తీ చేయాల్సి రావడంతో ఎక్కడ ఏ వర్గానికి నిర్ణయించారనేది వెల్లడి కానుంది. మూడింటరెండు కచ్చితంగా ఒకేవర్గానికి ఇవ్వాలి. మరో వర్గానికి ఎంపీ స్థానం ఇచ్చే అవకాశం ఉంది. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్ బాపురావు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉండడంతో ఆచితూచి ఎంపిక జరిగినట్లు నాయకులు చెబుతున్నారు.

అసంతృప్తులు ఏం చేస్తారో?

తొలి జాబితా, మలి జాబితాలో టికెట్ దక్కని అసంతృప్తులు ఏం చేస్తారనేది పార్టీవర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈసారి ఎలాగైనా ఉమ్మడి జిల్లాలో సత్తా చాటాలని హస్తం పార్టీ ఆరాటపడుతున్న నేపథ్యంలో నాయకుల మధ్య సమన్వయంతో ముందుకు వెళ్లడం ముఖ్యం. ఇప్పటికే గ్రూపులుగా ఉన్న నాయకులు టికెట్ల పంపకం తర్వాత మరింత రచ్చకెక్కే అవకాశం లేకపోలేదు. దీంతో అసంతృప్తులు ఏం చేస్తారనేది పార్టీలో చర్చ సాగుతోంది.

గంగను చేరిన గౌరమ్మ..



నృత్యాలతో ఆడిపాడుతున్న మహిళలు, యువతులు

జిల్లా వ్యాప్తంగా ఆయా గ్రామాలు, పట్టణాల్లో ఆదివారం మహిళలు, యువతులు బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఉత్సాహంగా బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. అనంతరం బతుకమ్మలను చెరువులు, వాగుల్లో నిమజ్జనం చేశారు. - 12లో▸

కొలువుదీరిన దుర్గామాత

- ప్రారంభమైన నవరాత్రి ఉత్సవాలు
- మండపాల వద్ద ప్రత్యేక పూజలు

నిర్మల్‌టౌన్: దేవి శరన్నవరాత్రులు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో దాదాపు 30 మండపాల్లో దుర్గామాత అమ్మవారు కొలువుదీరారు. ఈ నెల 23 వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయి. పట్టణంలో ప్రసిద్ధిగాంచిన బంగల్ పేట్ మహాలక్ష్మి, నందిగుండం దుర్గామాత, బాగులవాడ ఆంజనేయ స్వామి, తదితర ఆలయాల్లో అమ్మవారిని ప్రతిష్ఠాపించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. జై భవాని.. జై జై భవాని.. అంటూ.. ఆలయాలు మారుమోగాయి. అంతకుముందు దుర్గామాతను ఊరేగింపుగా మండపాల వద్దకు తీసుకెళ్లారు. నందిగుండం దుర్గామాత ఆలయ కమిటీ అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి, బంగల్ పేట్ మహాలక్ష్మి ఆలయ చైర్మన్ గంగాధర్ పాల్గొన్నారు.



బాలా త్రిపురసుందరి అవతారంలో అమ్మవారు

మొదటిరోజు బాలాత్రిపురసుందరి అవతారం

జిల్లా కేంద్రంలోని లలిత పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో మొదటి రోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, కుంకుమార్చన, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు అల్లోల వినోదమ్మ–మురళీధర్ రెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ గురుస్వామి మూర్తి, కోశాధికారి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్‌కలాం సేవలు మరువలేనివి

నిర్మల్‌ఖిల్లా: భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం శాస్త్ర సాంకేతిక రంగంలో చేసిన సేవలు మరువలేనివని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం కలాం 92వ జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో అబ్దుల్ కలాం ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అజారుద్దీన్ మిన హాజ్ ఉల్‌హక్, సూర్యకాంత్, అబ్దుల్ మసూద్, అజీమ్, జాకీర్, తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సొసైటీ సభ్యులు

బీఫామ్ వచ్చేసింది..







అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే బీఆర్‌ఎస్ అభ్యర్థులకు బీఆర్‌ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఫాంలు పంపిణీ చేశారు. జిల్లాలోని నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నుంచి పోటీ చేసే అభ్యర్థులు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, జాన్సన్ నాయక్ సీఎం కేసీఆర్ చేతుల మీదుగా బీఫాం అందుకున్నారు. - నిర్మల్

ఆర్టీసీ వందరోజుల 'పండుగ'

- 'బస్ భరో' పేరిట వినూత్న కార్యక్రమం
- లక్కీడ్రాతో ప్రయాణికులకు బహుమతులు

భైంసాటౌన్: 'ఆర్టీసీలో ప్రయాణం సురక్షితం–సుఖవంతం' అనే నినాదంతో ముందుకెళ్తున్న ఆర్టీసీ ప్రస్తుతం మరిన్ని నూతన కార్యక్రమాలతో ప్రయాణికులను ఆకర్షిస్తోంది. సీజనల్ బస్‌పాస్‌లతో పాటు టీ–9, టీ–30 టిక్కెట్లు, పండుగల సందర్భాల్లో రాయితీలు, లక్కీడ్రా పేరిట నగదు బహుమతులు అందిస్తూ ఆదాయం పెంచుకుంటోంది. ఇందులో భాగంగా వరుస పండుగలను ఆదాయంగా మలుచుకునేందుకు వినూత్న కార్యక్రమం తీసుకొచ్చింది. దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండుగల నేపథ్యంలో ఈనెల 15 నుంచి జనవరి 22 వరకు వందరోజులపాటు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా అదనంగా బస్సు సర్వీసులు నడుపుతూ ఆదాయం పెంచుకోవాలని నిర్ణయించింది. ఇందుకుగానూ 'అబ్ నహీతో కబ్ నహీ.. బస్ భరో' నినాదంతో ఆర్టీసీ సిబ్బందికి ఛాలెంజ్ ఇచ్చింది. పండుగల పూట ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడమే కాకుండా ఆర్టీసీకి ఆదాయం తేవాలని సూచిస్తున్నారు.



గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ ఫ్లెక్సీ

లక్కీడ్రా పేరిట బహుమతులు..

దసరా పండుగను పురస్కరించుకుని ఈనెల 21, 22, 23 తేదీల్లో ప్రయాణికులు స్వగ్రామాలకు రాక, 28, 29, 30 తేదీల్లో తిరుగు ప్రయాణాల నేపథ్యంలో ఆఫర్ ప్రకటించింది. పైన పేర్కొన్న తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారిని రీజియన్‌కు ఐదుగురు చొప్పున మహిళలు, పురుషులను ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.9,900 నగదు బహుమతి అందించనున్నారు. ప్రయాణికులు టిక్కెట్‌పై పేరు, చిరునామా, ఫోన్‌నంబర్ వివరాలను రాసి బస్టాండ్‌లోని డ్రాప్ బాక్స్‌లో వేయాలి.

'గ్రాండ్ ఫెస్టివల్ చాలెంజ్ జయప్రదం చేయాలి'

భైంసాటౌన్: దసరా, దీపావళి, క్రిస్మస్, సంక్రాంతి పండుగల నేపథ్యంలో ఆర్టీసీ బస్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆర్టీసీ డిప్యూటీ రీజియన్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం భైంసా డిపోను సందర్శించి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పండుగల వేళ ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసులు నడుపుతూ ఆదాయం పెంచుకోవాలన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

దసరా పండుగ వేళ ప్రయాణికుల కోసం 21, 22, 23 తేదీల్లో 28 నుంచి 30 తేదీల్లో ప్రయాణించేవారిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసి బహుమతులు అందిస్తాం. సంస్థ ఆదాయంతో పాటు పండుగల నేపథ్యంలో ప్రయాణికులకు బస్సు సర్వీసులు అందుబాటులో ఉండేలా గ్రాండ్ ఫెస్టివల్ ఛాలెంజ్ పేరిట వందరోజుల కార్యక్రమం చేపట్టాం. ప్రయాణికులు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఎం.అమృత, డీఎం, భైంసా

సోషల్ మీడియాపై నిఘా..

- వివాదాస్పద పోస్టులతో చిక్కులే...
- ఎన్నికల నియమావళి పాటిస్తేనే బెటర్
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసుశాఖ

నిర్మల్‌ఖిల్లా: ప్రస్తుతం సాంకేతికత విస్తృతంగా విస్తరించింది. జిల్లా కేంద్రం నుంచి మొదలుకొని మారుమూరు పల్లె వరకు ప్రతీఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్లు కనిపిస్తున్నాయి. యువకులు అధికంగా వాట్సాప్, ఫేస్‌బుక్ ట్విట్టర్, ఇన్‌స్టాగామ్ వంటి సోషల్ మీడియా ఖాతాలను వినియోగిస్తున్నారు. ఇదేక్రమంలో శాసనసభ ఎన్నికల నియమావళి కూడా అమలులోకి వచ్చింది. అయితే ప్రస్తుతం అన్ని రాజకీయ పార్టీలు ఈ సామాజిక మాధ్యమాలను వేదికగా మలుచుకుని ప్రచారాన్ని ముమ్మరం చేస్తున్నాయి. పార్టీలు కార్యకర్తలతో సోషల్ మీడియా విభాగాలను ఏర్పాటు చేసి అందులో ప్రచారాన్ని మొదలుపెట్టాయి. ఈ క్రమంలో అధికార, విపక్ష పార్టీల కార్యకర్తలు ఆరోపణలు ప్రత్యారోపణలు చేసుకుంటున్నారు. ఇటు కార్యకర్తలు సామాజిక మాధ్యమాల్లో పోస్టుల ద్వారా ప్రచార కార్యక్రమాలు, విమర్శలను కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు సోషల్ మీడియాపై నిఘా పెట్టారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక మీడియా మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేశారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం నిర్వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని వారు హెచ్చరిస్తున్నారు.

కలెక్టరేట్ నుంచి మానిటరింగ్..

రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావడంతో నిర్మల్ జిల్లాలో సైతం రాజకీయ పార్టీల నాయకులు సామాజిక మాధ్యమాల్లో అనుసరిస్తున్న కార్యక్రమాలు, ప్రచార పర్వాన్ని క్షుణ్ణంగా పరిశీలించడానికి కలెక్టరేట్ వేదికగా మీడియా మానిటరింగ్ బృందం పనిచేస్తుంది. ఈ మేరకు రెండు రోజుల కిందట మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ సెల్‌ను ప్రారంభించారు. ఇందులో కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా పోలీసు శాఖ, సామాజిక మాధ్యమాల నిపుణులు, సీనియర్ పాత్రికేయుడు, సీనియర్ సిటిజన్, జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి సభ్యులుగా ఉండి సామాజిక మాధ్యమాలను మానిటరింగ్ చేస్తారు. వీరు ప్రతీరోజు వివిధ మాధ్యమాల్లో ఆ రాజకీయ, సామాజిక వార్తాంశాలు, ప్రచార కార్యక్రమాలను పరిశీలన చేయడంతోపాటు ప్రతీ అంశాన్ని నమోదు చేస్తారు. ఎన్నికల సంఘం నియమావళికి విరుద్ధంగా రెచ్చగొట్టే ప్రసంగాలు, విమర్శలు, పోస్టులు చేసినా వాట్సప్ అడ్మిన్‌కు, పోస్టులను నమోదు చేసిన వ్యక్తికి నోటీసులు జారీ చేయడంతోపాటు, విచారణ నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటారు.



మీడియా మానిటరింగ్ విభాగంలో అధికారులకు సూచనలు చేస్తున్న అప్పటి కలెక్టర్ వరుణ్‌రెడ్డి

పరిధి దాటితే కేసులు..

వివిధ సామాజిక మాధ్యమాల్లో రాజకీయ పార్టీల నాయకులను, ప్రజాప్రతినిధులను కించపరిచేలా, ప్రజలను రెచ్చగొట్టే విధంగా పెట్టే వివాదాస్పద పోస్టులను అంశాలను పరిశీలించి కేసులను నమోదు చేసే అవకాశం ఉంటుందని పోలీసు శాఖ హెచ్చరిస్తుంది. సామాజిక మాధ్యమాల్లో నమోదవుతున్న అన్నిఅంశాలకు సంబంధించి ఎవరైనా ఫిర్యాదు చేసినా లేదా ఎన్నికల అధికారులు పరిశీలించి సంబంధిత గ్రూప్ అడ్మిన్‌పై, పోస్టులు నమోదు చేస్తున్న వ్యక్తులపై ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటారు.

అప్రమత్తంగా ఉండాలి...



వివిధ పార్టీలపై, రాజకీయ నాయకులపై పోస్టులు చేసే ముందు యువకులు కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. అనవసరంగా రెచ్చగొట్టే పోస్టులను సోషల్ మీడియాలో పెట్టడం ద్వారా కేసులలో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దు. ప్రస్తుతం ఎన్నికల నియామావళి అమల్లోకి వచ్చింది. సామాజిక మాధ్యమాల్లో వివాదస్పద పోస్టులు చేసినట్లు ఫిర్యాదు వస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. వివిధ మాధ్యమాల్లో నమోదవుతున్న అంశాలను నిరంతరం పరిశీలిస్తున్నాం.

– ప్రవీణ్‌కుమార్, ఎస్పీ, నిర్మల్

క్లుప్తంగా

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి


శేఖర్‌ను సన్మానిస్తున్న సంఘం బాధ్యులు

ఆదిలాబాద్‌టౌన్/ఇంద్రవెల్లి: గిరిజనేతరుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం తలపెట్టిన చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలని రాష్ట్ర గిరిజనేతరుల సంఘం అధ్యక్షుడు భరత్ వాగ్మారే కోరారు. జిల్లాకేంద్రంలోని దుర్గం ట్రస్ట్ కార్యాలయంలో, ఇంద్రవెల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి గిరిజనేతరులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. మావల నుంచి కలెక్టరేట్ వరకు భారీ ఎత్తున ర్యాలీ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తారని తెలిపారు. అదేవిధంగా గిరిజనేతరుల సంఘం అధికార ప్రతినిధిగా దుర్గం శేఖర్‌ను ఎన్నుకున్నారు. సంఘ బాధ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో జాడి రాజారెడ్డి, నారాయణ దుర్గే, మహేందర్, రాహుల్, అనుదీప్, రంగనాథ్, శ్రీకాంత్, శివాజీ కాడే, దిలీప్ మోరే, శివాజీ వావాద్కర్, రాజవర్ధన్ మస్కే, గౌతం సోమోరే, చంద్రశేన్ బావాలే తదితరులు పాల్గొన్నారు.

కడుపునొప్పి భరించలేక ఆత్మహత్య


గణేశ్ మృతదేహం

కుంటాల(ముధోల్): మండలంలోని విఠాపూర్ గ్రామానికి చెందిన చిట్యాల గణేశ్ (31) అనే యువకుడు కడుపునొప్పి భరించలేక ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై హన్మాండ్లు వివరాల ప్రకారం.. గణేశ్ మూడు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతుండగా ఆసుపత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నాడు. నయం కాకపోవడంతో ఆదివారం ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. అతడి తండ్రి దత్తు గమనించి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. గణేశ్ తండ్రి దత్తు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై హన్మాండ్లు పేర్కొన్నారు.

మద్యం మత్తులో వ్యక్తి..


రాథోడ్ ప్రవీణ్ మృతదేహం

సారంగపూర్(నిర్మల్): మద్యం మత్తులో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని అంతుల్వాయి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, మృతుడి బంధువుల ప్రకారం.. అంతుల్వాయి గ్రామానికి చెందిన రాథోడ్ ప్రవీణ్(40) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఇంటి వద్ద అతిగా మద్యం తాగి.. ఆ మైకంలోనే పురుగుల మందును మద్యంలో కలుపుకుని తాగాడు. కుటుంబసభ్యులు గమనించి ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. ప్రవీణ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు.


మైసమ్మ కుంట వద్ద వెదురు బొంగుల వంతెన

అడవి ఒడిలో ఒక రోజు..!

- నేటి నుంచి కవ్వాల్‌లో జంగల్ సఫారీ..
- 4 నెలల తర్వాత తిరిగి ప్రారంభం
- పెరిగిన సఫారీ చార్జీలు


అటవీ శాఖ సఫారీ మొదలయ్యే గోండుగూడ గేట్ నంబర్ 1

జన్నారం:ఉమ్మడి జిల్లాలో ప్రకృతి అందాలకు కొదువలేదు. ఎంత చూసినా తనివితీరదు.. ఇక కవ్వాల్ అభయారణ్యంలో అయితే రోజంతా చూసినా సమయం సరిపోదు. ప్రకృతి ఒడిలో విహరించే ప్రేమికుల కోసం పర్యాటక, అటవీశాఖ కవ్వాల్ అభయారణ్యంలో జంగల్ సఫారీ నిర్వహిస్తోంది. వర్షాకాలం నేపథ్యంలో జూన్‌లో సఫారీ నిలిపివేశారు. సోమవారం నుంచి సఫారీ పునఃప్రారంభిస్తున్నారు. దీంతో పర్యాటకులకు కవ్వాల్ అడవి అందాలు తిలకించే అవకాశం లభించింది.

'హరిత'లో బస..

జన్నారం మండల కేంద్రంలో ఉన్న పర్యాటక శాఖ హరిత రిసార్ట్‌లో బసచేసి కవ్వాల్ అటవీ అందాలు తిలకించేందుకు సఫారీ ద్వారా అడవి ప్రాంతంలో పర్యటిస్తారు. ఈ క్రమంలో పర్యాటక శాఖ అధ్వర్యంలో జంగిల్ సఫారీ ఏర్పాటు చేశారు. ఈ సఫారీ ద్వారా కవ్వాల్ టైగర్‌జోన్ ప్రాంతంలోని జన్నారం అటవీ డివిజన్ ప్రాంతంలోని పలు ప్రాంతాలను సఫారీ ద్వారా పర్యటకులను చూపిస్తారు. ఏటా అక్టోబర్ నుంచి జూన్ వరకు అటవీశాఖ అధికారులు అనుమతి ఇస్తున్నారు. దీంతో పర్యటకులను అడవిలో సుమారుగా 15 కి.మీ దూరం సఫారీలో వెళ్లే అవకాశం ఉంటుంది. అడవిలో ప్రయాణించే పర్యాటకులు వన్యప్రాణులను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉంటుంది.

ఇతర రాష్ట్రాల నుంచి రాక..

అడవి అందాలు, అడవిలోని వన్యప్రాణులు చూసేందుకు జన్నారంలోని పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన హరిత రిసార్ట్‌కు సుదూర ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఢిల్లీ, కర్ణాటక, తమిళనాడు, రాష్ట్రాల నుంచి పర్యటకులు ఇక్కడికి వస్తుంటారు. రాత్రి రిసార్ట్‌లో బస చేసిన పర్యాటకులు ఉదయం 6 గంటలకే అడవిలోకి వెళ్లేదుకు సఫారీ రెడీగా ఉంటుంది. అడవిలో సుమారుగా 15 కిలోమీటర్ల దూరం తీసుకెళ్తారు. అడవిలో ప్రయాణిస్తున్న సమయంలో చుక్కల దుప్పులు, సాంబర్లు, ఇతర వన్యప్రాణులు కనిపిస్తాయి. ఎప్పుడూనిపచ్చని అడవులు, స్వచ్ఛమైన గాలి, వన్యప్రాణుల పరుగులు పర్యాటకులకు, ప్రకృతి ప్రేమికులకు కొత్త అనుభూతినిస్తాయి. జలపాతాలు, పక్షుల కిలకిలారావాలు, వన్యప్రాణుల పరుగులు పర్యాటకులను ఆకట్టుకుంటాయి. ప్రతీరోజు ఉదయం 6 నుంచి 10.30 గంటల వరకు , సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకు సఫారీ ద్వారా అడవుల్లో తిప్పుతారు. అడవిలో ఈసారి బైసన్‌కుంట ప్రాంతంలో అటవీశాఖ అధ్వర్యంలో ప్రత్యేక ప్రాంతంలో పర్యటించేందుకు అనుమతి లభించింది. అదే విధంగా మల్యాల వాచ్‌టవర్ వరకు పర్యటకులను తీసుకెళ్తారు.

కాటేజీల వివరాలు:

జన్నారం హరిత రిసార్ట్‌లో పర్యాటకుల కోసం కాటేజీలను ఏర్పాటు చేశారు. ఇందులో 6 నాన్‌ఏసీ , 8 ఏసీ గదులతోపాటు ఒక డార్మెటరీ హాల్ ఉంది. సోమవారం నుంచి గురువారం (వీక్ డేస్‌లలో) నాన్ ఏసీ గదికి రూ.1,064, ఏసీ గదికి రూ.1,624, డార్మెటరీకి రూ.1,600, శుక్ర, శని, ఆదివారాల్లో (వీకెండ్ డేస్‌లలో) నాన్ ఏసీ రూ.1,176, ఏసీ గదికి రూ.1,792, డార్మెటరీకి రూ.1800 చార్జి చెల్లించాల్సి ఉంటుంది. హరిత రిసార్ట్‌లో రెస్టారెంట్ సౌకర్యం ఏర్పాటు చేశారు.

సఫారీ చార్జీల పెంపు..


లగ్జరీ సఫారీ వాహనం

అయితే గతంతో పోలిస్తే ప్రస్తుతం సఫారీ చార్జీలను అటవీశాఖ పెంచింది. సఫారీ వాహనాల సంఖ్య కూడా పెంచింది. గతంలో కేవలం రెండు సఫారీ వాహనాలు మాత్రమే నడిపించింది. ఈ సంవత్సరం కొత్తగా ఐదు వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. గతేడాది వరకు ఒక వాహనానికి రూ.2 వేలు చార్జి చేసేవారు. ఒక వాహనంలో ఆరుగురిని తీసుకెళ్లేవారు. అదనంగా ఎక్కితే ఒక్కరికి రూ.350 చొప్పున వసూలు చేసేవారు. ఇందులో పర్యాటక శాఖ పర్యావణ రుసుము కింద రూ.500 అటవీశాఖకు చెల్లించేవారు. ఈసారి సఫారీ చార్జీ రూ.500 పెరిగింది. ఒక వాహనానికి రూ.2,500 వసూలు చేయనున్నారు. అదనంగా ఉంటే ఒక్కరికి రూ.400 వసూలు చేస్తారు. పర్యావరణ చార్జీ కింద పర్యాటక శాఖ అటవీశాఖకు రూ.1,500 చెల్లించాల్సి ఉంటుంది. కొత్తగా వచ్చిన లగ్జరీ వాహనాలకు రూ.3,500 వసూలు చేస్తారు. అదనంగా ఉంటే.. ఒక్కరికి రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. వీకెండ్‌లో రూ.4 వేలు చార్జి చేస్తారు.

సౌకర్యాలు కల్పిస్తాం

కవ్వాల్ అటవీ అందాలను చూసేందుకు హైదరాబాద్, ముంబయి, ఢిల్లీతోపాటు ఇతర పట్టణాల నుంచి పర్యాటకులు వస్తుంటారు. వారి కోసం ఇక్కడ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నాం. బస చేసేందుకు కాటేజీలు, భోజన సౌకర్యం, సఫారీ సౌకర్యం ఉంది. ప్రతీరోజు ఉదయం, సాయంత్రం పర్యటకులను అడవిలోకి తీసుకెళ్తాం. అడవిలో అందమైన ప్రదేశాలు చూడవచ్చు. సఫారీ చార్జీలు, పర్యావరణ అనుమతి కోసం చార్జీలు పెంచాం. పర్యాటకులు సహకరించాలి.– సుదనబోయిన వీరెందర్, మేనేజర్ పర్యటక శాఖ

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చార్జీలు పెంపు

వివిధ ప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులకు కవ్వాల్ అడవులు అహ్లాదం పంచుతాయి. గతంలో కంటే వన్యప్రాణుల సంఖ్య పెరుగడంతో వన్యప్రాణులు పర్యాటకులకు విరివిగా కనిపిస్తూ కొత్త అనుభూతిని ఇస్తున్నాయి. అయితే సఫారీ చార్జీలు ప్రస్తుతం పెరిగాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే చార్జీలు పెంచడం జరిగింది. పర్యాటకుల కోసం కొత్తగా అటవీశాఖ ఐదు లగ్జరీ సఫారీ వాహనాలను అందుబాటులోకి తెచ్చింది. – హఫీజొద్దీన్, అటవీ రేంజ్ అధికారి

బ్రహ్మోత్సవాలకు వేళాయే..

- లక్ష్మీనారాయణ స్వామి దీక్షలు షురూ


మండల దీక్షలు స్వీకరిస్తున్న భక్తులు

జైనథ్: మండల కేంద్రంలోని అతి ప్రాచీన శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో స్వామి వారి తొలివిడత మండల దీక్షలు ఆదివారంతో ప్రారంభమయ్యాయి. భక్తులు ఉదయం పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం మాలధారణ గావించారు. భజనలు, కీర్తనలు ఆకట్టుకున్నాయి.

రెండు విడతల్లో దీక్షలు..

స్వామి వారి దీక్షలు రెండు విడతల్లో ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలి విడతలో ఈ నెల 15నుంచి నవంబర్ 24 వరకు 41 రోజుల పాటు మండల దీక్షలు, నవంబర్ 3 నుంచి 24 వరకు అర్ధ మండల దీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. రెండో విడతలో భాగంగా ఈ నెల 10 నుంచి డిసెంబర్ 1 వరకు మండల దీక్షలు, నవంబర్ 9 నుంచి డిసెంబర్ 1 వరకు అర్ధ మండల దీక్షలు ఉంటాయని తెలిపారు.

కార్తీక మాసంలో బ్రహ్మోత్సవాలు..

ఏటా కార్తీక మాసంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. నవంబర్ 14న స్వామి వారి కళ్యాణోత్సవం, డిసెంబర్ 1న రథోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సన్నద్ధమవుతున్నారు.

పద్మావతినగర్‌లో చోరీ

ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగుచూసింది. కాలనీలోని సంపత్‌రావు నివాసంలో అద్దెకు ఉంటున్న భీంరావు ఈ నెల 12న పని నిమిత్తం ఊరికి వెళ్లాడు. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చి చూసే సరికి చోరీ జరిగినట్లు గుర్తించాడు. ఇంట్లోకి చొరబడ్డ దొంగలు బీరువాను పగులగొట్టి ఆరు గ్రాముల బంగారంతో పాటు రూ.30వేల నగదు అపహరించారని బాధితుడు పేర్కొన్నాడు. ఎస్సై లింబాద్రి సంఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఖానాపూర్‌లోనే నోటాకు ఓట్లు..!

భైంసాటౌన్(ముధోల్): ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది. అందుకే ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటును వినియోగించుకోవాలని ప్రజాస్వామ్యవాదులు సూచిస్తుంటారు. అయినా నానాటికీ దిగజారుతున్న రాజకీయాలతో విసిగిన చాలామంది ఓటర్లు ఓటుకు దూరంగా ఉంటున్నారు. అయితే ఓటింగ్‌కు దూరంగా ఉండడం కంటే అభ్యర్థులు నచ్చకపోతే నోటాకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించింది. 2009 ఎన్నికల నుంచి నోటాకు అవకాశం కల్పించగా 2014, 2018 ఎన్నికల్లో నిర్మల్, ముధోల్‌తో పోలిస్తే ఖానాపూర్ నియోజకవర్గంలోనే నోటాకు ఎక్కువ ఓట్లు పోలయ్యాయి.

నోటాకు పోలైన ఓట్ల వివరాలిలా..

నియోజకవర్గం	2014లో	2018లో
నిర్మల్	1,365	1,367
ముధోల్	1,792	2,267
ఖానాపూర్	2,427	2,776

రూ.1.40 లక్షలు పట్టివేత


పట్టుకున్న నగదుతో అధికారుల బృందం

ఖానాపూర్: మండలంలోని బాదనకుర్తి గ్రామం చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఎన్నికల బృందం అధికారులు వాహనాల తనిఖీ చేపట్టి రూ.లక్షా 40వేల నగదును పట్టుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన ఎండీ సంహోద్దీన్ కారులో నగదు తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్ఎస్‌టీ అధికారి కృష్ణకుమార్, ఎస్‌బీ అధికారి బాదెం లక్ష్మీనారాయణ తెలిపారు. పట్టుకున్న నగదును సీజ్ చేస్తామని పేర్కొన్నారు.

బెల్టుషాపులపై పోలీసుల దాడులు


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

సారంగపూర్: మండల కేంద్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్టుషాపుపై ఆదివారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 53 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.15,790 ఉంటుందని ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


బోథ్: మండలంలోని చింతల్‌బోరి, సంపత్‌నాయక్ తండా గ్రామాల్లో ఆదివారం పోలీసులు దాడి అక్రమంగా మద్యాన్ని పట్టుకున్నారు. ఎస్సై రాము కథనం ప్రకారం..సంపత్‌నాయక్ తండాలో సాబ్లే గంగారామ్‌కు చెందిన బెల్టుషాప్‌పై దాడి చేయగా రూ. 2870 విలువైన మద్యం పట్టుకున్నట్లు తెలిపారు. అదేగ్రామానికి చెందిన రాథోడ్ సరస్వతి చెందిన బెల్లుషాపుపై దాడి చేసి రూ 3270 విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి


ముమేద్ (ఫైల్)

గుడిహత్నూర్: పాఠశాలకు సెలవులు రావడంతో స్నేహితులతో సరదాగా వస్తున్న విద్యార్థి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. మండల కేంద్రంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని డొంగర్‌గావ్‌కు చెందిన షేక్ జాకీర్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయన కుమారుడు ముమేద్ (14) గుడిహత్నూర్‌లోని ఆదర్శ పాఠశాలలో 9వ తరగతి చదువుకుంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో ముమేద్ తన స్నేహితులైన అర్హాన్, ఉబేద్, నిహాల్, అసర్‌తో కలిసి జాతీయ రహదారి గుండా డొంగర్‌గావ్ నుంచి గుడిహత్నూర్ వైపు నడుచుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో వేగంగా వచ్చిన ఐచర్ వాహనం వెనుక నుంచి ఆయనను ఢీకొట్టింది. ముమేద్‌తో పాటు స్నేహితుడు అరహాన్‌కు గాయాలయ్యాయి. వీరిని రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. అప్పటికే ముమేద్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. అరహాన్ చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

హస్నాపూర్ సమీపంలో యువకుడు ..


నదీమొద్దీన్ (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతిచెందాడు. ఎస్సై మనోహర్ కథనం ప్రకారం ..ఉట్నూర్‌కు చెందిన మహమ్మద్ నజీమొద్దిన్ కుమారుడు నదీమొద్దీన్(25) స్థానికంగా ఓ ఇంజినీర్ వద్ద తాత్కాలికంగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నార్నూర్ ప్రాంతంలో జరుగుతున్న పనులు చూడటానికి బైక్‌పై వెళ్తుండగా వెనుక నుంచి వస్తున్న కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో నదీమొద్దిన్ అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు ఘటనస్థలానికి చేరుకున్నారు. ఈ ప్రమాదానికి కారణమైన జైనూర్ మండలం లేండిజాలకు చెందిన డ్రైవర్ మెస్రం విజయ్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రం సీవిజిల్

- యాప్ రూపొందించిన ఈసీ
- ఎన్నికల్లో జరిగే అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదుకు అవకాశం
- నిమిషాల వ్యవధిలో ఫిర్యాదుదారుడికి సమాచారం

నిర్మల్‌ఖైస్‌గేట్: ఎన్నికల్లో అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీవిజిల్ యాప్ ప్రజల చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. ప్రస్తుతం ఈ యాప్ ఆధునీకరణతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం చేసింది. అక్రమాలకు సంబంధించిన ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 100 నిమిషాల వ్యవధిలో ఫిర్యాదుదారుడికి సమాచారం తెలియజేస్తారు. జిల్లా ఎన్నికల అధికారితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం చేరుతుంది. ఎవరైనా కోడ్ ఉల్లంఘించినా, డబ్బు, మద్యం, బహుమతులు వంటివి ఇచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేసినా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికల ప్రచారంలో అనుమతి లేకుండా లౌడ్ స్పీకర్ వాడడం, ఇతర నిబంధనలు ఉల్లంఘించినా, కుల, మతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ర్యాలీలు తీసినా ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు. ఈ యాప్ ద్వారా ఫిర్యాదు అందిన 10 నిమిషాలలో ఎన్నికల అధికారులు ఘటనాస్థలికి చేరుకుని 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటారు.



సీవిజిల్ యాప్

పనిచేసే విధానం ఇలా..

నాయకులు డబ్బు, మద్యం లేదా వస్తువుల రూపంలో ఓటర్లకు ఇచ్చే క్రమంలో ఫొటోలు, వీడియోలు తీసి ఘటనా స్థలం నుంచి సీవిజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. వెంటనే ఆ దృశ్యాలు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కి చేరుతాయి. అధికారులు అప్రమత్తమై ఘటనాస్థలికి చేరుకుని ఆయా నాయకులపై చర్యలు తీసుకుంటారు. ఈ యాప్ ద్వారా అందే సమాచారం బలమైన సాక్ష్యంగా పనిచేస్తుంది. అవసరమైతే ఆయా అభ్యర్థుల సభ్యత్వాన్ని రద్దు చేసినా ఆశ్చర్య పోవాల్సిన అవసరం లేదు. ఫొటోలు, లేదా వీడియోలు పంపిన వెంటనే ఫిర్యాదుదారులు ఏ లొకేషన్ నుంచి వాటిని పంపించారో అధికారులకు స్పష్టంగా తెలుస్తుంది. దీంతో వెంటనే చర్యలు తీసుకునేందుకు వీలుంటుంది. ఎన్నికల సంఘం నియమావళి ప్రకారం ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతారు.

పోలీస్ కంట్రోల్‌రూంకు అనుసంధానం

సీవిజిల్ యాప్ ద్వారా వచ్చే ఫిర్యాదులు, సమాచారం ఎన్నికల అధికారులతో పాటు నేరుగా పోలీస్ కంట్రోల్ రూంకు కూడా అందుతాయి. ఫ్లయింగ్ స్క్వాడ్లు, సర్వైలెన్స్ కమిటీలు, రిజర్వ్ టీంలు అప్రమత్తం అవుతాయి. వెంటనే లొకేషన్‌కు చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటారు. అంతేకాదు అవినీతికి పాల్పడిన అభ్యర్థులపై ఏవిధమైన చర్యలు తీసుకున్నారన్న సమాచారాన్ని సైతం ఫిర్యాదు చేసిన వారికి 100 నిమిషాల్లో యాప్ ద్వారా తెలియజేస్తారు.

నిజాయతీ పరులకు నేస్తం...

సభలు, సమావేశాల్లో ఎవరైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘించేలా ప్రసంగించినా, ఏ అక్రమాలకు పాల్పడినా వెంటనే రికార్డు చేసి అన్యాయాన్ని అడ్డుకునేందుకు సీవిజిల్ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ యాప్‌ను ఎన్నికల సంఘం 2018లో అందుబాటులోకి తెచ్చింది.

తప్పుడు సమాచారం స్వీకరించదు..

యాప్‌ను తప్పుదోవ పట్టించే వీలులేదు. ఈ యాప్‌ను ఘటన జరిగిన స్థలం నుంచే వినియోగించాలి. మరో చోటుకు వెళ్లి తీసిన ఫొటోలు, వీడియోలు అప్‌లోడ్ చేయడం సాధ్యం కాదు. పాత ఫొటోలతో ఎదుటి వారిపై ఫిర్యాదు చేసినా తీసుకోదు.

గురుకుల భవనంపై నుంచి పడి ఒకరికి గాయాలు

జైనథ్: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న బీసీ గురుకుల భవనం పై నుంచి పడి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన గౌతమ్ ముండే అనే మేస్త్రీ ఆదివారం గురుకుల భవనం రెండో అంతస్తులో పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. స్థానికులు అతన్ని ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

కుంటాల(ముధోల్): మండలంలోని అందాకూర్ శివారు ప్రాంతంలో ఆదివారం ఎస్సై హన్మాండ్లు ఆధ్వర్యంలో ఓ పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. రూ.2,230 నగదు స్వాధీనం చేసుకొని 52 పేక ముక్కలను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.



వినూత్న ఆలోచన.. పంట రక్షణ

బేల మండలం మాగంపాటన్ గ్రామానికి చెందిన మోహిబ్‌ఖాన్ అనే రైతు చేసిన వినూత్న ఆలోచన పంట దిగుబడికి భరోసానిస్తోంది. తనకున్న నాలుగు ఎకరాల్లో మిర్చి సాగు చేస్తున్నాడు. అయితే పంటకు నష్టం కలిగించే పురుగుల నుంచి కాపాడుకునేందుకు రూ.1,600తో సోలార్ ట్రాప్ పరికరం కొనుగోలు చేసి చేనులో ఏర్పాటు చేశాడు. ఇందులో ఏర్పాటు చేసిన లైట్‌కు తెల్లదోమ, పచ్చదోమ, నల్ల తామర, రెక్కల పురుగులు ఆకర్షితమై అందులో పోసిన నూనెలో పడిపోతాయి. ఫలితంగా పంట ఏపుగా ఎదిగి, దిగుబడి పెరుగుదలకు ఉపకరిస్తుందని రైతు చెబుతున్నాడు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్